క్లుప్తంగా

కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న సిద్దన్నపేట గ్రామస్తులు

నంగునూరు(సిద్దిపేట): సిద్దన్నపేట–రాంపూర్‌కు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం సిద్దన్నపేట గ్రామస్తులు కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామం నుంచి రాంపూర్ వెళ్లే వారిలో చాలా మంది వ్యవసాయ బావులు ఉన్నాయన్నారు. రోడ్డు సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడ్డామని, ఈ విషయమై ఎమ్మెల్యే హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లడంతో రూ.3.20 కోట్లు మంజూరు చేయించారని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, మల్లేశం, మల్లారెడ్డి, కనకారెడ్డి, సతీశ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డేటా ఆపరేటర్ల వినతి


వినతిపత్రం అందిస్తున్న ఆపరేటర్‌లు

చిన్నకోడూరు(సిద్దిపేట): కులగణన సర్వే దరఖాస్తులను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఎంట్రీ చేసిన ఆపరేటర్‌లకు చెల్లించాల్సిన డబ్బులు వెంటనే చెల్లించాలని కోరుతూ తహసీల్దార్ హరి కిరణ్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆపరేటర్లు మాట్లాడుతూ కులగణన సర్వే ఫారం ఎంట్రీకి రూ.30 చెల్లిస్తామని అధికారులు చెప్పారన్నారు. డేటా ఎంట్రీచేసి నాలుగు నెలలవుతున్నా ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని, తమకు రావాల్సిన డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆపరేటర్‌లు ఆనంద్, వినోద్, శ్రీనివాస్, సతీశ్, చందు, సాగర్ తదితరులు ఉన్నారు.

15 శాతం నిధులు కేటాయించండి: ఏబీవీపీ

హుస్నాబాద్/దుబ్బాకటౌన్/గజ్వేల్‌రూరల్: తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాకేశ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను చిన్నాభిన్నం చేశారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా అదే దారిలో వెళ్తోందని, స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని వాపోయారు. సమావేశంలో రాజేశ్, రాజు, రాహుల్, చరణ్ తదితరులు ఉన్నారు. అలాగే దుబ్బాకలో పట్టణ కార్యదర్శి అజయ్ కుమార్ మాట్లాడారు. జస్వంత్, వివేక్, రాజు, మహిపాల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు. గజ్వేల్‌లో రాష్ట్ర నేత మహేందర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నవీన్, సుజిత్, దావల్ పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన జెడ్పీ సీఈఓ రమేశ్


సీఈఓను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని కడవేర్గు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జెడ్పీ సీఈఓ రమేశ్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సౌకర్యాలను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న భోజనశాల నిర్మాణాన్ని పూర్తిచేయాలని, అలాగే టాయిలెట్ తదితర నిర్మాణాలకు నిధులు విడుదల చేయాలని హెచ్ఎం చంద్రశేఖర్‌రావు ఆయనను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, కృష్ణమూర్తి, లింగయ్య, రామకృష్ణ, కాంతికృష్ణ, మమత, సాజీదా, అరుణ, ప్రీతి, సీఆర్పీ రవీందర్, దినేశ్, రమేశ్, చంద్రశేఖర్ విద్యార్థులు పాల్గొన్నారు.

దళారులకు విక్రయించి నష్టపోవద్దు

పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి

తొగుట(దుబ్బాక): పొద్దు తిరుగుడు పంటను దళారులకు విక్రయించి నష్టపోవద్దని పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి రైతులకు సూచించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సొసైటీ ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర రూ.7,280లు పొందాలన్నారు. మార్కెట్‌లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించామని, రైతులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించి కొనుగోలు సజావుగా సాగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కుర్మ యాదగిరి, రైతులు పాల్గొన్నారు.

వంతెనలు ‘హైలెవెల్’ పనులు నిల్

- కొట్టుకు పోయిన నాచారం, చందాపూర్ వంతెనలు
- నిధులున్నా ప్రారంభం కాని పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


నాచారం–రైల్వేస్టేషన్ మార్గంలో మట్టికే పరిమితమైన వంతెన

వర్గల్(గజ్వేల్): నాచారం పుణ్యక్షేత్రం నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలోని లోలెవెల్ వంతెన నాలుగేళ్ల క్రితం భారీ వర్షాల వల్ల చెరువుకు గండిపడి కొట్టుకుపోయింది. అలాగే బొర్రగూడెం–చందాపూర్ గ్రామాల మధ్య లోలెవెల్ వంతెన కూడా వరద ఉధృతికి కొట్టుకుపోయింది. శాశ్వత పరిష్కారం కోసం మండలంలోని ఈ రెండు వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం రూ.2 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసింది. అయితే యేళ్లు గడుస్తున్నా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో ఆ మార్గాల్లో వెళ్లే రైతులు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

రైల్వేస్టేషన్ మార్గంలో..

మండలంలోని నాచగిరి నుంచి నాచారం రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో ఎగువన పెద్దచెరువు ఉంటుంది. దీంతో అలుగునీరు వెళ్లేందుకు దశాబ్దాల క్రితం రోడ్డుపై లోలెవెల్ వంతెన నిర్మించారు. చెరువుకు నాలుగేళ్ల క్రితం గండిపడడంతో వంతెన ఉనికిలేకుండా కొట్టుకుపోయింది. ఆ మార్గంలో వెళ్లే వారు మొరంపోసి తోవ ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడ హైలెవెల్(బ్రిడ్జి) వంతెన నిర్మాణానికి రెండేళ్ల క్రితం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

బొర్రగూడెం–చందాపూర్ మధ్య

తూప్రాన్–గజ్వేల్ రహదారిపై ఉన్న బొర్రగూడెం


చందాపూర్ మార్గంలో వంతెన దుస్థితి

స్టేజీ నుంచి చందాపూర్ 1.5 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. చందాపూర్ రోడ్డు మార్గంలో చెక్‌డ్యామ్ ఉంది. వానాకాలంలో పైనుంచి దాదాపు 20 చెరువుల అలుగు నీరు దీని మీదుగా పొంగి ప్రవహిస్తుంది. నీరు పోయేందుకు హైలెవెల్ వంతెనకు బదులు రోడ్డుపైన లోలెవెల్ వంతెన నిర్మించారు. దీంతో ప్రతియేటా ఇది కొట్టుకుపోవడం, తాత్కాలికంగా మట్టి పోసుకోవడం షరా మామూలైంది. ఇక్కడి ప్రజల ఇబ్బందులు తీరేలా రెండేళ్ల క్రితం ‘హైలెవెల్ బ్రిడ్జి’ నిర్మాణానికి ప్రభుత్వం రూ.85 లక్షలు మంజూరు చేసింది.

అగ్రిమెంట్లతోనే సరి

ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో నాచారం రైల్వేస్టేషన్ మార్గంలోను, చందాపూర్ మార్గంలో హైలెవెల్ వంతెనల నిర్మాణాల కోసం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు టెండర్లు నిర్వహించారు. 2023 సెప్టెంబర్ 27న సంబంధిత కంట్రాక్టర్లతో అగ్రిమెంట్ చేయించుకుని పనులు అప్పగించారు. ఒప్పందం ప్రకారం మార్చి 2024 కల్లా పనులు పూర్తికావాల్సి ఉంది. కాని రెండు చోట్లా వంతెన పనులు అగ్రిమెంట్‌కే పరిమితమయ్యాయి.

వానకాలం వస్తే దారి బంద్



వర్షాలు మొదలైతే భయమైతది. వరద రావడం.. రోడ్డు కొట్టుకుపోవడం మాకు సాధారణంగా మారింది. ఆ సమయంలో ఇతర గ్రామాలతో సంబంధాలు తెగిపోతయ్. ప్రతిసారీ ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నం. పై వంతెన కోసం నిధులు మంజూరైనయని మురిసిపోయినం. రెండేళ్లు గడుస్తున్నా పనుల ఊసే లేదు. ప్రభుత్వం చొరవ తీసుకుని వంతెనలు నిర్మింపజేయాలి.

– ఫాతిమా మేరీ, చందాపూర్

రీటెండర్ నిర్వహిస్తాం..

నాచారం, చందాపూర్‌లో రెండు హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణాలకు నిధులు మంజూరైన మాట వాస్తవమే. నిర్మాణ పనులకు సంబంధించి అగ్రిమెంట్ గడువు ముగిసింది. గత మార్చిలోనే పనులు పూర్తికావాల్సిఉంది. కాంట్రాక్టర్‌కు ఫైనల్ నోటీసు కూడా జారీచేశాం. రాకపోకల కోసం తాత్కాలిక మరమ్మతులు చేయించాం. హైలెవెల్ వంతెనల నిర్మాణం జరిగేలా రీటెండర్ ప్రక్రియ నిర్వహిస్తాం.

– ప్రభాకర్, డిప్యూటీ ఈఈ, పంచాయతీరాజ్ విభాగం

ఘనంగా స్వయం పాలన దినోత్సవం


వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు


మైలారం ప్రాథమిక పాఠశాలలో..


తున్కిఖాల్సా స్కూల్లో..

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని కూడవెల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం స్వపరిపాలనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా సాత్విక, ఎంఈఓగా ప్రణయ్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంగా నవీన్, ప్రధానోపాధ్యాయురాలిగా వర్షిని, పీఈటీగా ప్రణయ్, ఉపాధ్యాయులుగా హరిత, సాహిత్య, స్వాతి విధులు నిర్వహించారు. హెచ్ఎం శివాజీ, టీచర్లు గీతాదేవి బహుమతులు ప్రదానం చేశారు.

మైలారం, తున్కిఖాల్సాలో..

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం మైలారం, తున్కిఖాల్సా ప్రాథమిక పాఠశాలల్లో స్వయంపాలన దినోత్సవం ఘనంగా జరిగింది. విద్యార్థులే ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించారు.

విద్యార్థి డిబారు

సిద్దిపేటఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి తొగుట, మిరుదొడ్డి, ఎన్సాన్‌పల్లి పరీక్ష కేంద్రాలను బుధవారం తనిఖీ చేశారు. హుస్నాబాద్ మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో ఓ విద్యార్థి కాపీయింగ్ చేస్తూ పట్టుబడడంతో ఆ విద్యార్థిని డిబారు చేశారు. అనంతరం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ పరీక్షల్లో విద్యార్థులు ఎలాంటి కాపీయింగ్‌కు పాల్పడొద్దని సూచించారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌లు


శ్రీనివాస్


దివ్య

దుబ్బాకటౌన్/కొమురవెల్లి(సిద్దిపేట): ప్రభుత్వం చేపట్టిన తహసీల్దార్‌ల బదిలీల్లో భాగంగా రాయపోల్ తహసీల్దార్‌గా శ్రీనివాస్, కొమురవెల్లి తహసీల్దార్‌గా దివ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీనివాస్ కలెక్టర్ కార్యాలయంలో భూసేకరణ విభాగంలో విధులు నిర్వహించారు. అలాగే దివ్య ఇప్పటి వరకు రాయపోల్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. వారికి కార్యాలయ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్‌కు సన్మానం

సిద్దిపేటఅర్బన్: జిల్లాలో ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా కలెక్టర్ మనుచౌదరి ద్వారా అవార్డు పొందిన బక్రిచెప్యాల అంగన్‌వాడీ టీచర్ పద్మను మాజీ సర్పంచ్ బుధవారం ఘనంగా సన్మానించారు. మహిళా దినోత్సవం సందర్భంగా పద్మను ఈ అవార్డు వరించింది. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భిక్షపతి, పంచాయతీ కార్యదర్శి శ్రీవాణి, నర్సింహులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షలు

హుస్నాబాద్: ఎస్సీ వర్గీకరణను పూర్తిస్థాయిలో అమలు చేయాలని మాజీ కౌన్సిలర్ గాదెపాక రవీందర్ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నాయకులు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టం అమలయ్యేంత వరకు అన్ని రకాల పరీక్షలను నిలిపివేయాలన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే పునరాలోచించి వర్గీకరణను అమలు చేశాకనే నియామకాలను చేపట్టాలని కోరారు. లక్ష్మీనారాయణ, అశోక్, రాజశేఖర్, వెంకటేశ్, సురేశ్, విశ్వనాథం పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో 6 నుంచి పదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి గాను అర్హుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు 20 లోగా తమ దరఖాస్తులు పూర్తిచేయాలని, ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు సమీప ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

నిబంధనలు పాటించకపోతే సీజ్ చేయాలి

విద్యార్థి సంఘాల నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాలల వాహనాలను సీజ్ చేయాలని పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, డీఎస్‌యూ, డీబీఎఫ్ సంఘాల నాయకులు మండల విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ పాఠశాలలను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఆ పాఠశాలల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు శ్రీకాంత్, ప్రశాంత్, గణేశ్, అభిషేక్ భాను, రంజిత్‌రెడ్డి, యాదగిరి, భీం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

చేర్యాల(సిద్దిపేట): విద్యా సంవత్సరం పూర్తి కాక ముందే అడ్మిషన్లకు పాల్పడుతున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి భరత్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మార్సీలోని సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట సంజయ్, రాకేశ్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఘనంగా కల్యాణ మహోత్సవం

దుబ్బాకటౌన్: రాయపోల్ మండలం ఆరేపల్లిలో పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణ మహోత్సవం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తొగుట సీఐ షేక్ లతీఫ్, రాయపోల్ ఎస్ఐ విక్కుర్తి రఘుపతి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లేశం, శ్రీనివాస్, చంద్రం, జానీ, అంజయ్య, రాజు, రవి తదితరులున్నారు.

◆ అవకాశాలతోనే అభివృద్ధి

మిరుదొడ్డి(దుబ్బాక): మహిళలు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏపీఎం దాకయ్య కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఐకేపీ కార్యాలయంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళా వీఓఏలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీసీలు వైకుంఠం, దేవదాస్, ప్రభాకర్, శ్రీనివాస్, సిద్ధిరాములు, బాలరాజు, మణెమ్మ, అక్కౌంటెంట్ శారద, ఆపరేటర్ భాగ్య, వీఓఏలు పాల్గొన్నారు.

◆ పనులు పూర్తి చేయాలని కలెక్టర్‌కు వినతి

చేర్యాల(సిద్దిపేట): నాలుగో వార్డు పరిధిలో అసంపూర్తిగా ఉన్న జాతీయ రహదారి విస్తరణ పనులు త్వరగా పూర్తిచేయాలని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి కలెక్టర్ మనుచౌదరికి బుధవారం వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ పనులు అసంపూర్తిగా ఉండడంతో డ్రైనేజీల నుంచి మురుగునీరు రోడ్డుపైకి వచ్చి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

◆ ఉద్యోగులకు బదిలీలు సహజం

దుబ్బాకటౌన్: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని రాయపోల్ మండల విద్యాధికారి సత్యనారాయణరెడ్డి అన్నారు. వీరారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం ఆయన ఘనంగా సన్మానించారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా

మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్


అవగాహన కల్పిస్తున్న మల్లికార్జున్

హుస్నాబాద్: రోడ్లు, డ్రైనేజీలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ హెచ్చరించారు. పట్టణంలోని 1, 3, 17వ వార్డుల్లో చెత్త విభజనపై బసిల్ ఫౌండేషన్ సహకారంతో బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరు తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహన సిబ్బందికి అందించాలన్నారు. చెత్త వేరు చేయకపోతే తీసుకోబోమని చెప్పారు. తడి చెత్తతో సేంద్రీయ ఎరువు తయారుచేసి మొక్కలకు, పంట పొలాలకు వాడుకోవచ్చని, అలాగే పొడి చెత్తను రీసైక్లింగ్ యూనిట్లకు తరలిస్తామని తెలిపారు. ప్లాస్టిక్ కవర్లకు బదులు జ్యూట్ బ్యాగులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, బసిల్ ఫౌండేషన్ ప్రతినిధి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు


మిరుదొడ్డి(దుబ్బాక): మాజీ సర్పంచ్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మిరుదొడ్డి(దుబ్బాక)/నంగునూరు/కొండపాక (గజ్వేల్)/చేర్యాల(సిద్దిపేట): చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లనున్న మాజీ సర్పంచ్‌లను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకొన్నారు. తమ పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సర్పంచ్‌లు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో భూంపల్లి పోలీసులు మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, కనకయ్య, బుచ్చయ్య తదితరులను స్టేషన్‌కు తరలించారు. అదేవిధంగా రాజగోపాల్‌పేట పోలీసులు మాజీ సర్పంచ్‌లు కుమారస్వామి, వెంకటేశం, నాయకులు పరశురాములు, శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొన్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ భిక్షపతి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం అప్పులు చేసి పనులు పూర్తి చేశామన్నారు. యేళ్లు గడిచినా బిల్లులు రావడంలేదని, అసెంబ్లీలో మంత్రులను కలిసేందుకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం సరి కాదన్నారు. అలాగే కొండపాక మండలంలోని మర్పడ్గ, బందారం, రాంపల్లి తదితర గ్రామాల సర్పంచ్‌లను పోలీసులు అరెస్టుచేసి త్రీటౌన్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. అలాగే చేర్యాల మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ఎల్లారెడ్డి, భిక్షపతి, సొంటిరెక్కల భిక్షపతి, స్వప్న, కృష్ణవేణిని పోలీసులు అరెస్టు చేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


భూమిపూజ చేస్తున్న నర్సారెడ్డి

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి

ములుగు(గజ్వేల్): ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. మండలంలోని అచ్చాయిపల్లిలో రూ.5లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు బుధవారం ఆయన భూమి పూజ చేశారు. అలాగే దాసర్లపల్లితండాలో రూ.5 లక్షలచే నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల సంక్షేమం లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సలీం, పార్టీ నాయకులు శ్రీనివాస్, ఏకాంబర్‌రెడ్డి, గణేశ్, శ్రీధర్‌రెడ్డి, సత్యనారాయణ, ప్రభాకర్‌గుప్త, కరుణాకర్‌గౌడ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

సిద్దిపేటఅర్బన్: మండలంలోని బూరుగుపల్లి పరిధిలోని రామచంద్రనగర్‌లో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, ఎస్‌డీఎఫ్ నిధులు రూ.3లక్షలతో బోర్లు వేసేందుకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలకు మౌలిక వసతులను కల్పించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. యాదగిరి, కలీముద్దీన్, షాబుద్దీన్, లక్ష్మి, పాండు, బాలయ్య, కనకయ్య, సిద్ధన్న, రేణుక, నర్సింహులు పాల్గొన్నారు.

నేత్ర ఆరోగ్యానికి ముందస్తు చికిత్స అవసరం

ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శాంతి


ప్రపంచ గ్లకోమా దినోత్సవంలో పాల్గొన్న సిబ్బందితో డాక్టర్ శాంతి

సిద్దిపేటకమాన్: ముందుగానే సమస్యలను గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా భవిష్యత్‌లో కంటి చూపు సమస్య బారిన పడకుండా ఉండొచ్చని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శాంతి సూచించారు. ప్రపంచ గ్లకోమా దినోత్సవం సందర్భంగా ఆస్పత్రిలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 15వ తేదీ వరకు నేత్ర సమస్యలు, చికిత్స, తీసుకోవలసిన జాగ్రత్తలపై వైద్యులు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. ప్రజలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, విటమిన్ ఏ లభించే పండ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు సదానందం, శ్రావణి, జ్యోతి, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలంటూ నిరసన ర్యాలీ

గజ్వేల్‌రూరల్: డివిజన్ పరిధిలోని పంచాయతీ కార్మికులకు బకాయిపడిన వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. గేటు ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఆర్డీఓ ఏఓ, డివిజనల్ పంచాయతీ అధికారికి వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని గజ్వేల్, ములుగు, మర్కూక్, జగదేవ్‌పూర్, కుకునూరుపల్లి, కొండపాక, రాయపోల్ మండలాలల్లో పని చేస్తున్న పంచాయతీ కార్మికులకు 5 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని మండిపడ్డారు. అనంతరం ఆర్డీఓ ఏఓ మాట్లాడుతూ రెండు మూడు రోజుల్లో వేతనాల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు రంగారెడ్డి, దశరథ్, స్వామి, మహాలక్ష్మి, నగేశ్, బాలమణి, నర్సింహులు, బాబూరావు, కనకయ్య బాబు, ఎల్లయ్య, బాబు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల బలోపేతం కోసం కృషి

పీఎస్ఆర్ ట్రస్టు నిర్వాహకుడు నరేందర్

కొండపాక(గజ్వేల్): పాఠశాల బలోపేతం కోసం కృషి చేస్తామని పీఎస్ఆర్ ట్రస్టు నిర్వాహకుడు పొల్కంపల్లి నరేందర్ చెప్పారు. కుకునూరుపల్లిలోని హైస్కూల్‌లో బుధవారం ఫైర్ సేఫ్టీ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 400 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా చూసేందుకు ఫైర్ సేఫ్టీ పరికరాలు దోహదపడుతాయని చెప్పారు. అనంతరం ఎంఈఓ బచ్చలి సత్తయ్య మాట్లాడుతూ హైస్కూల్లో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనేలా పచ్చని చెట్లు, క్రీడా మైదానం ఉందన్నారు. క్రమ శిక్షణతో కూడిన విద్య అందేలా కృషి చేస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు రాంచంద్రం, శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.